

ఇంటింటా సంబరాల సంక్రాంతి

- సంప్రదాయబద్ధంగా భోగి పండుగ

రాయవరం: సంక్రాంతి వేడుకల్లో తొలి రోజైన భోగి పండగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రామాల్లో పోటాపోటీగా ఇళ్ల ముంగిట భోగి మంటలు వేశారు. యువతులు వేసిన రంగవల్లులతో ఇంటి ముంగిళ్లు కనువిందు చేశాయి. ప్రతి ఒక్కరూ ఉదయాన్నే అభ్యంగన స్నానాలు ఆచరించి, కొత్త దుస్తులు ధరించి తమ ఇళ్లలో ఇష్ట దైవానికి పూజలు చేశారు. ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వీధివీధి రంగవల్లులతో నిండిపోగా, పలుచోట్ల రంగురంగుల జెండాలతో అలంకరించారు. కొత్త అల్లుళ్లతో ఇళ్లన్నీ సందడి సందడిగా మారాయి. పలుచోట్ల చిన్నారులకు సంప్రదాయబద్ధంగా భోగిపండ్లు వేసి, ఆశీర్వచనాలు అందజేశారు. యువతులు ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను ఉంచి, మధ్యలో రాధా గోపాలకృష్ణ బొమ్మను ఉంచి పూజలు నిర్వహించారు.

దుర్గుణాల దహనమే భోగి

దుర్గుణాల సమూహాన్ని త్యజించే మానసిక దహన క్రియే భోగి పర్వదినంగా వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. సంక్రాంతి పర్వదినం ఆరంభానికి సూచికగా నిర్వహించే భోగి పండుగ సందర్భంగా ఆయన పీఠంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. రైతులు తమకు పనికిరాని విరిగిన కాడి, అరిగిన మేడి, దెబ్బతిన్న గంప తదితర వస్తువులను భోగిమంటలో వేసి ఏ విధంగా దహనం చేస్తారో..దుర్గుణాలను మానసికంగా దహించాలనే త్యాగ ప్రక్రియ భోగిపండుగ రహస్యమని ఆధ్యాత్మిక ప్రసంగంలో పేర్కొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో ఆదివారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే పుణ్య స్నానమాచరించి గ్రామాల ప్రధాన కూడళ్ల వద్ద భోగి మంట వెలిగించారు. గోవు పిడకలతో తయారు చేసిన దండలను మంటలో వేశారు. కపిలేశ్వరపురం, పడమర ఖండ్రిక, అద్దంకివారిలంక, వీధివారిలంక గ్రామాల్లో భోగి సందర్భంగా సందడి నెలకొంది.


ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్


రాయవరం మండలం పసలపూడిలో భోగిమంట చుట్టూ భక్తిప్రపత్తులతో ప్రదక్షిణ చేస్తున్న ప్రజలు

ఆనందంగా సంక్రాంతి

రామచంద్రపురం రూరల్: పల్లె జీవనంలో అతి ముఖ్యమైంది సంక్రాంతి పండగ అని ప్రజలందరూ ఆనందంగా సంక్రాంతి పండగను జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వకర్త పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా ద్రాక్షారామ బియ్యంపేట రామాలయం వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమంలో సూర్యప్రకాశ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అధిక సంఖ్యలో మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు సూర్యప్రకాశ్ బహుమతులను అందజేశారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ప్రజలందరూ ఎన్నడూ లేని విధంగా సంక్రాంతి జరుపుకొంటున్నారన్నారు. కార్యక్రమంలో ద్రాక్షారామ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి శంకర్రావు, ఉపాధ్యక్షుడు బాలం గణేశ్వరరావు, కార్యదర్శి వాసంశెట్టి చిన్ని, జాయింట్ సెక్రటరీ చింతపల్లి వేంకటేశ్వరరావు, వార్డు సభ్యురాలు పిల్లి సుహాసిని తదితరులు విజేతలను అభినందించారు.



సంప్రదాయాలకు పెద్దపీట

- మంత్రి వేణు

రామచంద్రపురం: పల్లె జీవనంలో సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ మనసులో ఉన్న మలినాలను మంటలో దహింపజేసి నిర్మల మనసుతో ప్రజాజీవనం గడపాలన్నదే అసలైన భోగి, సంక్రాంతి పండగలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని మంత్రి స్వగృహం వద్ద ఆదివారం కుటుంబ సమేతంగా భోగి మంటని వెలిగించారు. తొలుత గోమాతతో ప్రత్యేక పూజలు జరిపించి భోగి మంట చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మంత్రి వేణు మాట్లాడుతూ అనుభూతి, ఆనందం కలిగించే పండగ సంక్రాంతి అన్నారు. గోదావరి జిల్లాల్లో ఆదరణ కలిగిన టువంటి పండగ సంక్రాంతి అన్నారు. ఈ సంవత్సరం అందరికీ మంచి పంటలు పండడం ద్వారా గ్రామాల్లో కళకళలాడుతూ ఆనందంగా సంక్రాంతి జరుపుకొంటున్నారన్నారు. సంప్రదాయాలకు ప్రధానంగా పెద్దపీట చేసిన ప్రభుత్వం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా సంప్రదాయంగా రాష్ట్ర ప్రజలంతా సంక్రాంతి పండగను కుటుంబ సమేతంగా ఆనందంగా జరుపుకోవాలని మంత్రి వేణు శుభాకాంక్షలు తెలియజేశారు.


భోగి మంట వేసిన మంత్రి వేణు, సతీమణి వరలక్ష్మి తదితరులు

కలసిన మనసులు.. కదలాడిన జ్ఞాపకాలు


పసలపూడిలో 1982-92 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థుల గ్రూపు ఫొటో

రాయవరం: వారంతా 30 ఏళ్ల క్రితం పాఠశాల విద్య అనంతరం విడిపోయారు. ఇప్పుడు వారంతా వివాహాలు చేసుకుని, వివిధ వ్యాపారాలు, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వారంతా మూడు దశాబ్దాల అనంతరం తిరిగి కలుసుకున్నారు. భార్య, పిల్లలతో కలిసి తము చదువుకున్న పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. ఒకరికొకరు నిక్‌నేమ్‌లతో పిలుచుకుంటూ..తమ చిన్ననాటి స్నేహితులను గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేస్తూ..భావోద్వేగాలకు గురయ్యారు. ఈ సన్నివేశానికి రాయవరం మండలం పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా నిలిచింది. 1982–92 సంవత్సరాల మధ్య ఒకటి నుంచి 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో ఉత్సాహంగా..ఉల్లాసంగా గడిపారు. తమ చిన్ననాటి స్నేహితులతో తారతమ్యాలు మరచి..గత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ మరోసారి బాల్యంలోకి వెళ్లిపోయారు. తిరిగి మరోమారు చిన్ననాటి స్నేహితులంతా కలసి గ్రూపు ఫొటో దిగారు.

వేంకటేశ్వరస్వామికి మకరతోరణం సమర్పణ

కపిలేశ్వరపురం: ధనుర్మాసం సందర్భంగా మండలంలోని వీధివారిలంకలోని భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి వారికి వీధి శ్రీనివాసరావు, సూర్యకళ దంపతులు రూ.35 వేల విలువైన ఇత్తడి మకరతోరణం సమర్పించారు. పెద్దింటి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మకర తోరణాన్ని స్వామి వారికి అలంకరించారు. ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. దాతలను ఆలయ నిర్వాహకులు, భక్తులు అభినందించారు.


వీధివారిలంకలో స్వామికి మకర తోరణం

1,300 మందికి చీరలు, దుప్పట్ల పంపిణీ

కపిలేశ్వరపురం: మండపేట యువజన సహాయ సంఘం 45వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముత్తారెడ్డి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా 1,300 మందికి చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఇనపకోళ్ళ సత్యనారాయణ తదితరుల సహాయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త వి.సాయికుమార్‌బాబు హాజరయ్యారు.


మండపేటలో దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

తల్లిపాల గది ఏర్పాటు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ బస్టాండ్ వద్ద భీమేశ్వర దంత వైద్యశాల డాక్టర్ బి.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో తల్లి పిల్లలకు పాలు ఇచ్చుకునే గదిని ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లుతో కలసి డాక్టర్ క్రాంతికుమార్ దీనిని ఆదివారం ప్రారంభించారు. కె.నాగరత్నకుమారి, బి.నాగేషుకుమారి, సీఆర్‌సీ రమణ, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

రాయవరం: కూర్మాపురంలో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై ఆదివారం స్థానిక పోలీసులు దాడి చేశారు. కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి నాలుగు కత్తులు, నాలుగు కోళ్లు, రూ. 2,770 స్వాధీనం చేసుకున్నామని రాయవరం ఎస్సై జి.నరేష్ తెలిపారు. అలాగే మండలంలోని రాయవరం, చెల్లూరు గ్రామాల్లో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 2750 స్వాధీనం చేసుకున్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేయాలి

రామచంద్రపురం: సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ ప్రతులు భోగిమంటల్లో వేసి, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని సీపీఐ నాయకులు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ప్రతినిధులు కలిసి పై కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజవర్గ కార్యదర్శి పెద్దిరెడ్డి రాము, కార్యవర్గ సభ్యులు వి.కృష్ణమూర్తి, ఎం.సత్యభద్రరాజు, ఐఏఎల్ ప్రతినిధి వర్గం వి.గోపాలరావు, వై.దుర్గాప్రసాద్, బి.తారకేశ్వరరావు, పి.రవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

కె.గంగవరం: మండలంలోని భట్లపాలిక గ్రామంలో ఆదివారం తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఎస్.ఈశ్వరరావు కుటుంబం పూరిపాకలో నివాసం ఉంటోంది. ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇంటికి నిప్పంటుకుంది. కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీసి స్థానికుల సహాయంతో మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. అయితే అగ్నికి గాలి తోడవడంతో పూరి పాక మొత్తం అగ్నికి ఆహుతయింది. ఇంట్లో ఉన్న రూ.80 వేల సొమ్ముతో పాటు బంగారం, సామా న్లు అగ్నికి కాలిపోయాయి. ఈ సంఘటన వల్ల సుమారు. రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని స్థానికులు చెబుతున్నారు.